క్లుప్తంగా


కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం



సమావేశమైన ఆర్డీవో హనుమా నాయక్

రామగిరి: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జేఎన్‌టీయు కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లపై శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డితో మంథని ఆర్డీవో హనుమా నాయక్ సమావేశమయ్యారు. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల బ్యాలెట్ బాక్స్‌లు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అకడిమిక్ బ్లాక్-2 లో గతంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ రూమ్‌లు, షెడ్డులను పరిశీలించారు. ఆయన వెంట రామగిరి తహసీల్దార్ రాంచందర్‌రావు, నాయబ్ తహసీల్దార్ రాకేశ్, పీడీ కృష్ణారెడ్డి ఉన్నారు.

పడిపోతేనే పట్టించుకుంటారా?



ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ టవర్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ భూముల నుంచి అక్రమార్కులు మట్టిని యథేచ్ఛగా తరలించుకుపోవడం రామగుండం నుంచి నాగార్జునసాగర్‌కు విద్యుత్ సరఫరా చేసే 400కేవీ లైన్ టవర్‌కు గండంగా మారింది. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారులో పవర్‌గ్రిడ్‌కు చెందిన టవర్ చుట్టూ మట్టిని ఎత్తుకెళ్లారు. దీంతో ఆ టవర్ ఏ క్షణాన పడిపోతోందో తెలియని పరిస్థితి నెలకొంది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ మేనేజర్ పవన్‌కుమార్ రెవెన్యూ, పోలీసు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుని టవర్ పడిపోకుండా చూడాలని రెవెన్యూ, పోలీసు అధికారులకిచ్చిన ఫిర్యాదులో కోరినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ఆధునీకరణతో పాటు పారిశుధ్య నిర్వహణ, తాగునీరు సరఫరా సక్రమంగా జరిగేలా చేస్తానని చెప్పారు.

దివ్యాంగుడికి స్కూటీ అందజేత

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటకు చెందిన దివ్యాంగుడైన మొగిలి అనిల్‌బాబుకు ప్రభుత్వం నుంచి మంజూరైన స్కూటీని శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. అనిల్‌బాబు తనకు స్కూటీ అందించాలని జెడ్పీచైర్మన్ పుట్ట మధు, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కోరగా ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన స్కూటీని అనిల్‌బాబుకు అందించారు. సర్పంచ్ కొండ వెంకటేశ్, నాయకులు బొమ్మగాని అనిల్, ఎద్దు రాజయ్య, సంపత్, మల్లేశ్, నర్సయ్య, అంజయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెద్దపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. స్వచ్ఛ శుక్రవార్ కార్యక్రమంలో భాగంగా మురుగునీటి కాలువలను శుభ్రం చేశారు. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. మున్సిపల్ శానిటరీ సిబ్బంది జయరాజ్, ఎల్లమ్మ, సతీశ్ ఉన్నారు.

బహుజనులంటే ఇంత చులకనా?

పెద్దపల్లిరూరల్: పోరాటయోధుడు సర్వాయి పాప న్న జయంతి కార్యక్రమాన్ని అధికారులు మొక్కుబడిగా నిర్వహించారంటూ బీసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, కాల్వశ్రీరాంపూర్ మాజీ జెడ్పీటీసీ గోపగాని సారయ్యతో పాటు గౌడసంఘ నాయకులు బైఠాయించారు.నాయకులు ఏగోలపు సదయ్య, జాగిరి అంజయ్య, శంకర్, సింగం సత్తయ్య, నల్లవెల్లి శంకర్, రఘు, విష్ణువర్ధన్ తదితరులున్నారు.

కుష్ఠు నివారణకు ప్రత్యేక చర్యలు

కాల్వశ్రీరాంపూర్: కుష్ఠు వ్యాధి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా ప్యారా మెడికల్ ఆఫీసర్ దేవిసింగ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కుష్ఠు నిర్ధారణ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందితే తొందరగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్, సీహెచ్‌వో సరస్వతి, హెచ్‌ఈవో శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ సరోజ, ఆశాలు శారద, మౌనిక, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా.. ర్యాంకు సాధించేనా?

- స్పందన లేని పౌరుల ఫీడ్‌బ్యాక్
- అటకెక్కిన తడిపొడి చెత్త సేకరణ
- రామగుండంలో నేటి నుంచి క్యూసీఐ బృందం పర్యటన



కూరగాయల మార్కెట్ ఎదుట మ్యాన్‌హోల్ నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

కోల్‌సిటీ(రామగుండం): ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పోటీ పడుతున్న రామగుండం నగరపాలక సంస్థ ఆశించినస్థాయిలో ర్యాంకును కైవసం చేసుకోలేకపోతోంది. ఈ ఏడాది కూడా పోటీలో ఉండగా, మెరుగైన ర్యాంక్ సాధనపై పాలకవర్గం, అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శలను ఎదుర్కొంటున్నారు. తడి, పొడి చెత్తసేకరణ పూర్తిగా గాడితప్పింది. డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడంతో గోదావరినది ఒడ్డున చెత్తను డంపింగ్ చేస్తున్నారు. నగరంలో మ్యాన్‌హోళ్లు పగిలిపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నా చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. చక్రాలు విరిగిపోయి చెత్తడబ్బాలు బోర్లా పడుతున్నా చర్యల్లేవు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి పారిశుద్ధ్యం పనితీరును తనిఖీ చేయడానికి క్యూసీఐ ప్రతినిధుల ప్రత్యేక బృందం రామగుండం రానున్నారని తెలిసింది. కాగా క్యూసీఐ బృందాన్ని ఆకట్టుకునేందుకు పాలకులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

స్పందన లేని సిటిజన్ ఫీడ్‌బ్యాక్

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తోంది. పోటీలో ప్రజల అభిప్రాయాల(సిటిజన్ ఫీడ్‌బ్యాక్) సేకరణ కీలకమైంది. కాగా రామగుండంలో ఆశించిన స్థాయిలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ రావడం లేదు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌పై ప్రత్యేక దృష్టిసారించారు. అయితే నగరంలో పారిశుద్ధ్యం పూర్తిగా గాడితప్పడంతోనే ప్రజలు మెరుగైన ఫీడ్‌బ్యాక్ ఇవ్వడానికి స్పందించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

గాడితప్పిన పారిశుద్ధ్యం

బల్దియాలో తడి, పొడి చెత్త సేకరణ పూర్తిగా గాడి తప్పింది. ఈ వైఫల్యంతోనే గతేడాది కూడా అనుకున్నంత మార్కులు రాలేదు. కీలకమైన ఎస్‌టీపీలు లేక ఓడీఎఫ్ ప్లస్ మాత్రమే దక్కుతోంది. రామగుండంలో ఎస్టీపీ నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాలేదు. మరో ఎస్టీపీ నిర్మించాల్సి ఉంది. కంపాక్టర్ బిన్స్ వీల్స్ విరిగిపోయి ఎక్కడికక్కడ బిన్స్ బోర్లా పడి ఉన్నాయి. వాటికి మరమ్మతు చేయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. సులభ్‌కాంప్లెక్స్‌లు కంపుకొడుతున్నాయి. చాలా చోట్ల మ్యాన్‌హోళ్లు పగిలి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కోట్లాది నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన అత్యాధునిక వాహనాలను సరైన పద్ధతిలో ఉపయోగించకుండా మూలకు పడేసి ఉన్నాయి.

నేటి నుంచి క్యూసీఐ బృందం పర్యటన

పారిశుద్ధ్యం పనితీరును తనిఖీ చేయడానికి శనివారం నుంచి రామగుండంలో క్యూసీఐ ప్రతినిధుల బృందం పర్యటించనుంది. సఫాయి మిత్ర సురక్షా చాలెంజ్, వ్యర్థాల తరలింపు, మురుగు శుద్ధీకరణ, తడిపొడి చెత్త వేరు చేసే ప్రక్రియ, ప్రాసెసింగ్ డిస్పోజల్, సులభ్ కాంప్లెక్స్ తదితర వివరాలను తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీకి తుది నివేదిక తయారు చేయడంలో ఈ ప్రతినిధుల పర్యటన కీలకమైనది.

స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో
కేటాయించిన మార్కులు: 9,500
సిటిజన్ వాయిస్: 26 శాతం, 2,475 మార్కులు
సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్: 48 శాతం, 4,525 మార్కులు
సర్టిఫికేషన్: 26 శాతం, 2,500 మార్కులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వచ్చిన ర్యాంక్‌లు..

ఏడాది	ర్యాంకు	ఏడాది	ర్యాంకు
2022	136	2019	192
2021	92	2018	194
2020	211	2017	191

బల్దియాలో..

మొత్తం డివిజన్లు	50
విస్తీర్ణం	93.87 చదరపు కిలోమీటర్లు
జనాభా(2011 లెక్కల ప్రకారం)	2,29,644
మురికివాడలు	92
అసెస్‌మెంట్ల ప్రకారం గృహాలు	50,536

మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

జ్యోతినగర్(రామగుండం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఉమెన్ (పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 19న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతి శీల మహిళ సంఘం, మరో నాలుగు మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే అర్ధ శతాబ్ది వార్షిక ఉత్సవాల సదస్సులో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. చట్టాలను కఠినతరం చేయాలని కోరారు. సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు శంకర్, పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు సరోజన, లక్ష్మి, మమత, మల్లమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ, ఎంపీటీసీ కొలిపాక శరణ్య చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలోని పలు వీధుల్లో రూ.3లక్షల నిధులతో సీసీ డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. పాలకవర్గ సభ్యులు తూళ్ల వెంకటేశ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్, ఆముల రాములు, బొమ్మగాని రాజయ్యగౌడ్, బైరి జ్యోతి, మేర్గు గురువయ్య, కొలిపాక మధుకర్‌రెడ్డి ఉన్నారు.

పనుల పరిశీలన

పెద్దపల్లిరూరల్: మండలంలోని ముత్తారంలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్ పరిశీలించారు. సీసీరోడ్డు పనులు, ఇంకుడుగుంతల నిర్మాణం పరిశీలించారు.

సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలతో ముందుకెళ్లాలి



సుల్తానాబాద్‌రూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు



సుల్తానాబాద్: నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్



రామగిరి: నివాళి అర్పిస్తున్న ఎంపీపీ దేవక్క

గోదావరిఖని/రామగుండం/పెద్దపల్లిరూరల్/కాల్వశ్రీరాంపూర్/ముత్తారం/జ్యోతినగర్/కమాన్‌పూర్/పాలకుర్తి/జూలపలి/ఎలిగేడు/రామగిరి/సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్/యైటింక్లయిన్‌కాలనీ: సర్వాయి పాపన్న గౌడ్ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో శుక్రవారం పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

బానిసలుగా ఉంటే భవిష్యత్ ఉండదు



నివాళి అర్పిస్తున్న జెడ్పీచైర్మన్ పుట్ట మధు

మంథని: భవిష్యత్ తరాల బాగుకోసం అనేక మంది మహనీయులు త్యాగాలు చేశారని, వారిని స్మరించుకుంటూ ముందుకెళ్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీలోని కొంత మంది బానిసలుగా మారారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మంథనిలో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జెడ్పీ చైర్మన్ నివాసం నుంచి అంబేడ్కర్ చౌక్ మీదుగా జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ జక్కు శ్రీహర్షిణితో కలిసి ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ సమీపంలో మాట్లాడారు. పైసలు, పదవుల కోసం బానిసలుగా ఉంటే భవిష్యత్తు ప్రశ్నార్థకరమవుతుందన్నారు. సర్వాయి పాపన్న వారసులుగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ఏగోళపు శంకర్‌గౌడ్, ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ సభ్యురాలు తరగం సుమలత, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, నాయకులు కోట రవి, శంకర్‌లాల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

సంపద వనాల మొక్కల పరిశీలన

మంథని: మండలంలోని పార్వతీ బ్యారేజీ సమీపంలో సంపద వనాల్లో నాటిన మొక్కలను కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ వై.నర్సింగరావు పరిశీంచారు. మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రమేశ్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ముత్తారం: మండలంలోని పారుపల్లికి చెందిన కోడం వెంకటేశ్ శుక్రవారం కాంగ్రెస్ నుంచి మంథనిలో జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పారుపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పర్శ శ్రీనివాస్, ఒడ్నాల రాజు ఆధ్వర్యంలో వచ్చిన వెంకటేశ్‌తో పాటు పలువురికి జెడ్పీ చైర్మన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

నగరానికి నిధుల మంజూరుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్, తదితరులు

కోల్‌సిటీ: రామగుండం నగరానికి రూ.100 కోట్లు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌కు విన్నవించగా స్పందించారని, మొదటి విడత రూ.50 కోట్లు విడుదల చేశారని, మిగతా త్వరలో విడుదలవుతాయని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలకవర్గం ఆధ్వర్యంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావుతో కలిసి క్షీరాభిషేకం చేశారు.

కూరగాయల మార్కెట్‌లో మక్కాన్‌సింగ్ పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: స్థానిక కూరగాయల మార్కెట్‌లో డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ శుక్రవారం పర్యటించారు. కూరగాయల వ్యాపారస్తులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు దశరథం, తదితరులు ఉన్నారు.

50ఏళ్లలో జరగని అభివృద్ధి పదేళ్లలో పూర్తి



మాట్లాడుతున్న అనంతరెడ్డి

సుల్తానాబాద్: 50ఏళ్లలో నియోజకవర్గంలో జరగని అభివృద్ధి పదేళ్లలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి చేసి నిరూపించారని రైతు సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాసర్ల అనంతరెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. సుల్తానాబాద్ మండలంలో సుద్దాల నుంచి సుగ్లాంపల్లి, మియాపూర్ నుంచి పెద్ద బొంకూర్, నారాయణరావుపల్లికి రూ.7కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల నుంచి అంతర్గత రోడ్లకు రూ.29 కోట్లు మంజూరు చేశారన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పురం ప్రేంచందర్‌రావు, ప్రజాప్రతినిధులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, ఫకీర్ యాదవ్, గట్టు శ్రీనివాస్, రాజ్‌కుమార్, సంపత్‌యాదవ్, అంజయ్యగౌడ్ ఉన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమ్మెకు బీజేపీ మద్దతు

పెద్దపల్లిరూరల్: రెండో ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మెకు బీజేపీ మద్దతుగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం దీక్షా శిబిరాన్ని సందర్శించారు. నాయకులు పిన్నింటి రాజు, రాంసింగ్, ఫహీం, శ్రీనివాసరావు, సమ్మయ్య, నరేశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఓదెల: మండలంలోని పొత్కపల్లిలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణావు ఆధ్వర్యంలో శానగొండకు చెందిన ఆయా పార్టీలకు చెందిన 50మంది నాయకులు, యువకులు గడపగడపకు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. శానగొండ గ్రామానికి చెందిన వార్డుసభ్యులు గుంటి రవీందర్, జీల తిరుపతి, యాదవ సంఘం అధ్యక్షుడు మెడుదల కొమురయ్య, నాయకులు ఐలయ్య యాదవ్, నర్సయ్యయాదవ్, కుమార్, స్వామిగౌడ్, గౌతిరెడ్డి రంగారెడ్డి, సమ్మిరెడ్డి, తిరుపతిరెడ్డి, గుంటి సాయి, జొంగోని శ్రీనివాస్‌గౌడ్, మార్గ బానుప్రకాశ్‌తోపాటు 50మంది మాజీ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ వైస్ ఎంపీపీ అంబాల కొమురయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గొస్కె రాజేశం, ఎంపీటీసీ రాగిడి రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఆళ్ల సుమన్‌రెడ్డి, నాయకులు రాజు, నీర్ల శ్రీనివాస్, మాదవరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ మూడోరోజుకు చేరిన సమ్మె

పెద్దపల్లిరూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు సమ్మె చేస్తున్నా.. పాలకులు పట్టించుకోవడంలేదని ఏఐటీయూసీ నాయకుడు కడారి సునీల్ ఆరోపించాఆరు. ఏఎన్ఎం లు చేపట్టిన సమ్మె శుక్రవారం 3వ రోజుకు చేరింది.

✦ ఓదెలలో కురిసిన వర్షం

ఓదెల: మండలంలో శుక్రవారం వర్షం కురిసింది. దీంతో పంటలకు నీరందే సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆనందోత్సాహంలో ఉన్నారు. మండలంలోని ఓదెల, కొలనూర్, పొత్కపల్లి, గుంపుల గ్రామాల్లో వర్షం కురవడంతో కుంటలకు చెరువులకు నీరు చేరాయి.

✦ పీఏసీఎస్‌లో 254 మందికి రుణమాఫీ

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో పంట రుణాలు తీసుకున్న వారిలో రూ.లక్షలోపు 254 మందికి రూ.1,26,01,895 రుణమాఫీ జరిగినట్లు పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

✦ యాదవ మహాసభ విజయవంతం చేయాలి

గోదావరిఖని: అఖిల భారత మహాసభ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 23న జిల్లాలోని నందన గార్డెన్‌లో జరిగే యాదవ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశ్ యాదవ్ కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25న హైదరాబాద్‌లో జరిగే యాదవుల యుద్ధభేరికి యాదవ కులసంఘాలన్నీ పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు.

✦ పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కమాన్‌పూర్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి శనివారం కమాన్‌పూర్ ఎస్సై రాములు బాధితుడికి అప్పగించారు. మంథని మండలం గంగపురికి చెందిన బుర్ర రాకేశ్ ఇటీవల కమాన్‌పూర్‌లో పోగొట్టుకున్నాడు. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ గుర్తించి బాధితుడికి అప్పగించారు.

✦ 29 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

సుల్తానాబాద్: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు నిర్వహించనున్నట్లు ఎంఈవో సురేందర్ శుక్రవారం తెలిపారు. 29న 14, 17ఏళ్ల బాలికలకు, 30న బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, సెప్టెంబర్ 1న అండర్ 14, 17 బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హెచ్ఎంలు రాజేందర్, విజయ్, జోనల్‌స్థాయి ఎస్‌జీఎఫ్ కన్వీనర్ సంధ్య, మండల కన్వీనర్ దాసరి రమేశ్, పీఈటీలు ఉన్నారు.

✦ సైబర్ ట్రాఫికింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

ధర్మారం: మొబైల్ ఇంటర్నెట్ ద్వారా యువత సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని, వారిని గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రజ్వల సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ చంద్రయ్య సూచించారు. మండలంలోని కటికెనపల్లి రైతువేదికలో శుక్రవారం పెద్దపల్లి మాతాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ధర్మారం, జూలపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు.

✦ సమస్యలు పరిష్కరించాలని నిరసన

పెద్దపల్లిరూరల్: పాడి, పశుసంపదను కాపాడి వృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పశుమిత్రలు జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏడీ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరి, ప్రియాంక, సరిత, మమత, అనూష, నవ్య, చంద్రకళ ఉన్నారు.

చెట్టుకు ఢీకొన్న ప్రైవేటు స్కూల్ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి క్రీసెంట్ స్కూల్ బస్సు శుక్రవారం చెట్టుకు ఢీకొన్న సంఘటనలో 5వ తరగతికి చెందిన హర్షవర్ధన్‌కు స్వల్ప గాయాలు కాగా మిగతా విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు. క్రీసెంట్ స్కూల్‌కు చెందిన బస్సు కాల్వశ్రీరాంపూర్ నుంచి కూనారం గ్రామానికి విద్యార్థులను తీసుకొని వెళ్తుండగా ఎదురుగా కాల్వశ్రీరాంపూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఏఎస్సై నీలిమ తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందుండాలి

సుల్తానాబాద్: మున్సిపల్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందుండాలని మెప్మా పీడీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త వేరు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరారు. మహిళా సంఘాలకు కాకుండా రికవరీ చేయాల్సిన బాధ్యత ఆర్పీలకు ఉందన్నారు. పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సుల్తానాబాద్, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఏడీఎంసీ మౌనిక, ఆర్పీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ముత్తారం: రానున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముత్తారంలో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అవినీతి అక్రమాలను ఎండగట్టాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు బియ్యాని శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

కాల్వశ్రీరాంపూర్/రామగిరి/సుల్తానాబాద్‌రూరల్/ఎలిగేడు: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ వితరణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కాల్వశ్రీరాంపూర్ మండలం పాతమడిపెల్లి, ఇదులాపూర్‌లో బృందం సభ్యులు వెంకటేశ్, సునీల్‌కుమార్, రామగిరి మండలం పన్నూర్‌లో నవీన్, సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లె, ఐతరాజుపల్లి గ్రామాల్లో, ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేటలో సీహెచ్.రాకేశ్ పర్యటించారు. శానిటేషన్, హరితహారం, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడి చెత్త నిర్వహణను పరిశీలించారు.

పాపన్న స్ఫూర్తితో బహుజనరాజ్యం స్థాపిద్దాం



బైక్‌ర్యాలీలో బీఎస్పీ నాయకులు

పెద్దపల్లిరూరల్: సర్వాయి పాపన్న స్ఫూర్తితో రాష్ట్రంలో రాచరికపు పాలన సాగిస్తున్న కేసీఆర్ సర్కార్‌ను కూల్చి బహుజనరాజ్యం స్థాపిద్దామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పాపన్న జయంతి ఉత్సవం సందర్భంగా పట్టణ వీధుల్లో పార్టీ శ్రేణులతో కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. రైల్వే ఫ్లైఓవర్ వంతెన వద్దగల పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు రాజు, సవిత, స్వప్న, వెంకటేశ్, రాజనర్సయ్య, దుర్గయ్య, గోపాల్, అనిల్, రియాజ్, శోభ, అజీం, సతీశ్, రవికుమార్ పాల్గొన్నారు.